నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, సోమవారం 14 ఏప్రిల్ 2025 | VIKARABAD




రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## ప్రతి పల్లె నుంచి దండులా తరలాలి

### కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్ : వరంగల్‌లో ఈనెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు దండులా తరలివెళ్లి సక్సెస్ చేద్దామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆదివారం కడ్తాల్ మండల కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. రజతోత్సవ సభకు ప్రతి పల్లె నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, పార్టీ అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, ఉద్యమ కార్యాచరణపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నా రు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని..అయితే, ప్రస్తుతం కాంగ్రెస్ అసమర్థతతో రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. రజతోత్సవ సభకు కల్వకుర్తి నియోజక వర్గంలోని ఏడు మండలాలకు 35 బస్సులు కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధ, విజితారెడ్డి, నర్సింహ, మాజీ ఎం పీపీ శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు పరమేశ్, అర్జున్‌రావు, జైపాల్‌రెడ్డి, శంకర్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, నర్సింహగౌడ్, కృష్ణారెడ్డి, శ్రీనూనాయక్, వెంకటయ్య, జ్యోతయ్య, మాజీ ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, రమేశ్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు ముజీబూర్ రెహ్మాన్, శ్రీను, పత్యానాయక్, వీరయ్య, గోపా ల్, లాయక్‌అలీ, ధర్మారెడ్డి, ఖలీల్, మోహన్ రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, వినోద్, సాబేర్, వెంకటేశ్, శ్రీశైలం, రమేశ్, రామ చంద్రయ్య, కృష్ణ, అంజి, శ్రీకాంత్, సతీశ్, మల్లేశ్, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.



రజతోత్సవ మహాసభ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

# వాడవాడలా.. రజతోత్సవ సంబురం

- రంగారెడ్డి జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశాలు
- నేటి నుంచి మండలాలు, మున్సిపాలిటీ అధ్యక్ష, కార్యదర్శులతో..

రంగారెడ్డి, ఏప్రిల్ 13 : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే చేవెళ్ల, షాద్‌నగర్ సెగ్మెంట్లలో పూర్తయ్యాయి. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సమావేశాన్ని కూడా నిర్వహించారు. అలాగే, నేటి నుంచి నియోజకవర్గాల వారీగా సమన్వయ కమిటీ సమావేశాలతోపాటు మండలాలు, మున్సిపాలిటీల అధ్యక్ష, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాలు జరుగనున్నాయి. జిల్లాలోని 16 మున్సిపాలిటీలు, రెండు నగర పాలక సంస్థలు, 21 మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు రజతోత్సవానికి స్వచ్ఛందంగా తరలివెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం జిల్లా నుంచి 317 ఆర్టీసీ బస్సులు, 20 ప్రైవేట్ బస్సులు, సుమారు 700 కార్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి 75 ఆర్టీసీ, 20 ప్రైవేటు బస్సులు, 160 కార్లు, ఎల్బీనగర్ నుంచి 72 బస్సులు, 220 కార్లు, రాజేంద్రనగర్ నుంచి 55 ఆర్టీసీ బస్సులు, 100 కార్లు, మహేశ్వరం నుంచి 83 బస్సులు, 100 కార్లు, చేవెళ్ల నియోజకవర్గం నుంచి 62బస్సులు, 100 కార్లను సిద్ధంగా ఉంచనున్నారు. ఎల్బీనగర్, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాల నుంచి పార్టీ క్యాడర్ పెద్ద ఎత్తున బహిరంగ సభకు తరలివస్తారని భావిస్తున్న నేపథ్యంలో.. పై మూడు సెగ్మెంట్లలో ఇప్పటికే కార్యకర్తల సమావేశాలు నిర్వహించి బహిరంగసభకు హాజరుకావాల్సిన ఆవశ్యకతపై దిశానిర్దేశం చేశారు.

### క్యాడర్‌లో జోష్..

బీఆర్ఎస్ రజతోత్సవ సభను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తుండడంతో గులాబీ దళంలో కొత్త జోష్ కనిపిస్తున్నది. ఇప్పటికే చేవెళ్ల, షాద్‌నగర్ సెగ్మెంట్లలో సన్నాహక సమావేశాలు పూర్తయ్యాయి. త్వరలోనే ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియో జకవర్గాల్లోనూ సమావేశాలను నిర్వహించనున్నారు.

### కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేక మొదలైంది

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేక ప్రారంభమైనది. ఆ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్కహామీని కూడా సక్రమంగా నెరవేర్చకపోవడంతో అన్ని వర్గాల వారు ఆగ్రహంతో ఉన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ అనంతరం రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతుంది. వరంగల్ సభకు గ్రామాలు, మున్సిపాలిటీల నుంచి అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. అందుకోసం ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, కార్లను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**- మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు**

## భారీగా కదులుదాం..

### తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు : వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వేలాదిగా తరలివెళ్లి సక్సెస్ చేద్దామని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తాండూరులోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని తాండూరు, యాలాల, పెద్దేముల్ మండలాల బీఆర్ఎస్ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించి బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 16 నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. భూగర్భజలాలు అడుగంటి చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రేవంత్ పాలనపై ప్రజలందరూ ఆగ్రహంతో ఉన్నారని.. మళ్లీ కేసీఆర్ వస్తేనే మాకు న్యాయం జరుగుతుందని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. తెలంగాణలో రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలు మారకుండా కష్టకాలంలో ప్రజలకు తోడుండి బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేసే వారికే మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే సభకు తాండూరు నియోజకవర్గం నుంచి అన్ని వర్గాల వారు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యాలాల మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, తాండూరు మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, నాయకులు రమేశ్, శకుంతల, ఉమా శంకర్ తదితరులు ఉన్నారు.



వరంగల్‌లో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను పురస్కరించుకుని వికారా బాద్ పట్టణంలోని 5వ వార్డు(కొత్రేపల్లి)లో వాల్ రైటింగ్ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుక్ ఆనంద్ – వికారాబాద్, ఏప్రిల్ 13

### ప్రతి గ్రామంలోనూ

## వాల్ పెయింటింగ్‌లు వేయించాలి

### రజతోత్సవ సభను సక్సెస్ చేయాలి : పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి




పరిగి పట్టణంలో రజతోత్సవ మహాసభ వాల్ పెయింటింగ్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 13 : బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు పరిగి నియోజకవర్గం నుంచి 60 బస్సులు, 200 ఇతర వాహనాల్లో అధిక సంఖ్యలో తరలివెళ్తామని మాజీ ఎమ్మెల్యే కొప్పు ల మహేశ్‌రెడ్డి తెలిపారు. రజతోత్సవ మహాసభకు సంబంధించి ఆదివారం పరిగిలో ఆయన దగ్గరుండి వాల్ పెయింటింగ్ చేయించారు. ప్రధాన రహదారిపై గల ప్రతి గ్రామంలోనూ వాల్ పెయింటింగ్‌లు వేయించాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. బీఆర్ఎస్ ఏర్పడి 25 ఏండ్లు అవుతున్న సందర్భంగా జరిగే సభను ప్రతి ఒక్కరూ తమ ఇంటి పండుగలా భావించి, స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు బీఆర్ఎస్ ఒక్కటే శ్రీరామ రక్ష అని స్పష్టం చేశారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు కష్టాలు పడుతున్నారని.. హామీల అమల్లో రేవంత్ సర్కార్ విఫలమైనదని విమర్శించారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు భారీగా తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రవికుమార్, కృష్ణ, తాహెర్‌అలీ పాల్గొన్నారు.

### రేపు సన్నాహక సమావేశం

వరంగల్‌లో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు సంబంధించి నియోజకవర్గ సన్నాహక సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు పరిగిలోని బృందావన్ గార్డెన్‌లో జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. దీనికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ పార్టీ మండల, గ్రామ కమిటీల నాయకులు హాజరు కావాలన్నారు.



తాండూరు : రజతోత్సవ మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

# బల్దియాలో గలీజు దందాలు ..!

### గడువు ముగిసినా.. కొనసాగుతున్న వ్యాపారాలు

- మరికొన్ని చోట్ల సబ్ లీజుల పేరిట దోపిడీ
- రూ. లక్షల్లో వసూలు.. బల్దియాకు వేలల్లో చెల్లింపులు
- నోటీసులు జారీ చేస్తున్న ఎస్టేట్ విభాగం

సిటీబ్యూరో, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ఆస్తులను అక్రమ లీజుదారులు దర్జాగా అనుభవిస్తున్నారు. ఏండ్ల తరబడి లీజు గడువు ముగిసినా.. వాటిని స్వాధీనం చేసుకోవడంలో ఎస్టేట్ విభాగం నిర్లక్ష్యం చేస్తున్నది. గజం స్థలానికి రూ.1 అద్దె చెల్లిస్తున్న లీజు ఒప్పందాలు నేటికీ యథావిధిగా కొనసాగుతున్నాయి. ఆజాద్(మోతి) మార్కెట్ లీజుల గడువు ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఇదే క్రమంలోనే తాజాగా లీజుదారులు సబ్ లీజులకు ఇచ్చి మరీ దందాలకు తెరలేపారు. రూ.లక్షల్లో వసూలు చేసుకుంటూ జీహెచ్ఎంసీకి కేవలం రూ. వేలల్లో మాత్రమే డబ్బులు చెల్లిస్తున్నట్లు గుర్తించారు. ఇప్పటి వరకు 1750 మందికి నోటీసులు జారీ చేయడం గమనార్హం. వాస్తవంగా లీజు పూర్తయ్యాక అధికారులు ఆయా దుకాణాలను ఖాళీ చేయించాలి. మళ్లీ టెండర్ వేలం వేసి కొనసాగించాలి. ఏడాదికొకసారి అద్దె విలువ 5% మేర పెంచాలి. కానీ ఘనత వహించిన ఎస్టేట్ విభాగం నోటీసులతోనే సరిపెడుతుండడం విమర్శలకు తావిస్తున్నది.

### దశాబ్దాల కిందట..

జీహెచ్ఎంసీ ఆస్తులను దశాబ్దాల కిందట అద్దెకు తీసుకొని గడువు ముగిసినా, వాటిని ఖాళీ చేయకుండా ఇతరులకు అప్పగించకుండా అడ్డుపడుతున్న లీజుదారులు, వాటిని సబ్ లీజులకు ఇచ్చి లక్షల రూపాయలు అద్దెలు వసూలు చేసుకొని జీహెచ్ఎంసీకి కేవలం వేలల్లో మాత్రమే చెల్లిస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 22 మార్కెట్లుండగా, వాటిలో 2152 స్టాళ్లు ఉన్నాయి. వెజిటేబుల్ మార్కెట్లు 5, నాన్ వెజ్ మార్కెట్లు 7, రెండు కలిపి 10 కలిపి ఉన్నాయి. మున్సిపల్ కాంప్లెక్స్‌లు 19, యూనిట్లు 715 వరకు, మోడల్ మార్కెట్లు 37 ఉండగా 589 షాపులు ఉన్నాయి. సుమారు రెండు దశాబ్దాల నుంచి అద్దెలు చెల్లించని వ్యాపారులు ఉన్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు.




### ఆన్‌లైన్‌లోకి ప్రతి ఆస్తి

గ్రేటర్ వ్యాప్తంగా జీహెచ్ఎంసీ ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రార్ ఏర్పాటు చేసి దాని ప్రకారంగా కంప్యూటరైజ్ చేశారు. ఆస్తులకు సంబంధించిన లీజు పూర్తయినా.. ఇంకా కొనసాగుతున్నట్లు వివరాలను సేకరించి వారందరికీ నోటీసులు జారీ చేసి వాటి వివరాలను అందులో పొందుపర్చారు. లీజుకు తీసుకున్న వ్యక్తి వినియోగించుకుంటున్నారా లేదా ఇతరులు ఉపయోగించుకుంటున్నారా అని క్షేత్ర స్థాయిలో జోనల్ అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులు విచారించి ఈ నివేదిక సిద్ధం చేశారు. రానున్న రోజుల్లో లీజు మార్కెట్ రేటు ప్రకారంగా కేటాయింపు జరగాలని, లీజు పూర్తయినా.. ఇంకా కొనసాగుతున్న దుకాణాల వివరాలపై పూర్తి నివేదిక అందజేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. అద్దె చెల్లింపు కూడా ఆన్‌లైన్ ద్వారా చెల్లించడంతో పాటు ఒక్కొక్క ఆస్తికి ఒక్కో ఐడీని కేటాయిస్తున్నారు.

## వీడని చిక్కుముడి

### నత్తనడకన ఓల్డ్ సిటీ కారిడార్ భూసేకరణ ప్రక్రియ

సిటీబ్యూరో : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓల్డ్ సిటీ మెట్రో ప్రాజెక్టు భూముల పంచాయితీ సంక్లిష్టంగా మారుతున్నది. 7.5 కిలోమీటర్ల పొడువైన ప్రాజెక్టు కోసం 1100 ఆస్తులు సేకరించాల్సి ఉన్నా... ఇప్పటివరకు 205 ఆస్తులనే మెట్రోకు అందజేయగా... మిగిలిన ఆస్తుల సేకరణలో ఎదురు దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఓ వైపు చారిత్రక, మతపరమైన కట్టడాల విషయంలో కోర్టు చిక్కులు రాగా, మరోవైపు ప్రైవేట్ వ్యక్తులూ ఇదే తరహాలో పరిహారం కోసం ప్రతిఘటించడంతో భూసేకరణ సులభంగా పూర్తయ్యేలా కనిపించడంలేదు. భూసేకరణ ప్రక్రియ వేగంగా సాగుతున్నది.. ఇప్పటి వరకు రూ. 212 కోట్ల చెక్కులను పంపిణీ చేశామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చెబుతున్నా... మిగిలిన ఆస్తుల సేకరణ ఎప్పటిలోగా పూర్తవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

### 1100పైగా ప్రభావిత ఆస్తుల సేకరణకు..

మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించనున్న మెట్రో నిర్మాణానికి గతేడాది ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ఈ సమయంలో 1100కు పైగా ప్రభావిత ఆస్తులను సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. డీపీఆర్ పూర్తి కావడంతో... భూసేకరణ పనులు మూడు నెలల్లో పూర్తి చేసి, చురుగ్గా ప్రాజెక్టు పనులు చేపడతామని మెట్రో వర్గాలు తెలిపాయి. కానీ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులతో ఓల్డ్ సిటీ మెట్రో ప్రాజెక్టు అనుకున్నంత వేగాన్ని పుంజుకోవడం లేదు.

### మరిన్ని కొత్త సమస్యలు..

7.5కిలోమీటర్ల పొడవైన మార్గంలో మతపరమైన, చారిత్రక కట్టడాలే ఎక్కువగా ఉన్నాయి. వీటి విషయంలో మెట్రో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని, ఎలాంటి ముప్పు వాటిల్లకుండా పనులు చేపడుతామంటున్నా క్షేత్రస్థాయిలో ప్రాజెక్టును విశ్వసించడం లేదు. దీంతో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కోర్టులను ఆశ్రయిస్తుండగా... ప్రాజెక్టుకు మరిన్ని కొత్త సమస్యలు వస్తున్నాయి. అదేవిధంగా గజానికి రూ. 80వేలకు పైగా పరిహారం చెల్లిస్తామని చెబుతున్నా... మార్కెట్ విలువ ఆధారంగా మరింత అధిక పరిహారం కోరుతూ కోర్టును ఆశ్రయిస్తున్నారు.

# హద్దుల నిర్ధారణ ఎప్పుడో..



- వికారాబాద్ జిల్లాలో పెరుగుతున్న భూముల సర్వేకు సంబంధించిన దరఖాస్తులు
- నెలల తరబడిగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- జిల్లాలో పెండింగ్‌లో 2500 అప్లికేషన్లు
- సిబ్బంది కొరతతో సర్వే ఆలస్యమవుతుందని చెప్తున్న అధికారులు
- జిల్లాలో 20 మండలాల్లో 10 మండలాలకే ఉన్న సర్వేయర్లు
- వరుస క్రమంలో కాకుండా ఇష్టానుసారంగా సర్వే చేపడుతున్నారనే ఆరోపణలు

వికారాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో సర్వే కోసం రైతులు కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగిలా ప్రదక్షిణలు చేస్తున్నారు. భూముల సర్వేకు సంబంధించి దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. భూముల కొలతల్లో వచ్చే తేడాలతోపాటు తగాదాలను పరిష్కరించుకునేందుకు భూసర్వే తప్పనిసరి కావడంతో తమ భూములకు హద్దులను నిర్ణయించాలని, సర్వే చేయాలని అధికారులను ఆశ్రయిస్తున్నారు. భూముల సర్వే నిమిత్తం ఆన్‌లైన్‌లో చలాన్లు చెల్లించి సర్వేకు దరఖాస్తు చేసుకొని సర్వేయర్లు ఎప్పుడొస్తారో.. ఎప్పుడు హద్దులను గుర్తిస్తారో అంటూ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. సరిపడా సిబ్బంది లేకపోవడంతోనే నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నదని అధికారులు చెబుతున్నారు. అయి తే, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజాప్రతినిధులకు సంబంధించిన భూముల సర్వేలను చలాన్లు చెల్లించిన రెండు, మూడు రోజుల్లోనే పూర్తి చేస్తున్న అధికారులు.. సామాన్యులను మాత్రం నెలల తరబడి తిప్పించుకుంటున్నారని పలువురు మండిపడుతున్నారు. జిల్లాలో 20 మండలాలుండగా కేవలం సగం మండలాలకు మాత్రమే సర్వేయర్లు ఉన్నారు.

### జిల్లాలో పెండింగ్‌లో 2500 దరఖాస్తులు..

భూముల సర్వేకు సంబంధించి అధిక మొత్తంలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. భూముల కొలతల్లో వచ్చిన తేడాలను గుర్తించి సరిచేసేందుకు సర్వేకు దరఖాస్తు చేసుకున్న రైతులు సంబంధిత అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో భూక్రయవిక్రయాలు పెరుగడంతోపాటు ఆన్‌లైన్‌తోపాటు భూకొలతల్లో చాలా వ్యత్యాసాలు వస్తున్నాయి. కొందరు రైతులకు రికార్డుల్లో భూమి ఎక్కువుంటే..క్షేత్రస్థాయిలో మాత్రం తక్కువగా ఉంటున్నది. మరికొందరికి క్షేత్రస్థాయిలో భూమి తక్కువగా ఉంటే, రికార్డుల్లో మాత్రం ఎక్కువగా చూపిస్తున్నది. దీంతో పక్క పక్కన పొలాలున్న రైతుల మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయి. అదే విధంగా భూముల కొనుగోలు సమయంలో క్షేత్రస్థాయిలో, ఆన్‌లైన్‌లో భూకొలతల్లో తేడాలు కనిపిస్తుండడంతో తప్పనిసరిగా సర్వేకు దరఖాస్తు చేసుకుంటున్నారు. జిల్లాలో ఆర్ఎస్ఆర్ సమస్య లేని గ్రామాల్లేవని రెవెన్యూ ఉన్నతాధికారులే స్పష్టం చేస్తున్నారు. భూముల సర్వేతోనే భూముల కొలతల్లో హెచ్చు, తగ్గులు పరిష్కారం అవుతాయని పేర్కొంటున్నారు. భూముల కొలతల్లో క్షేత్రస్థాయిలో, ఆన్‌లైన్‌లో తేడాలుండడంతో రైతులు తమ భూములను విక్రయించాలని చూసినా అమ్ముడుపోని పరిస్థితి నెలకొన్నది.

రైతులు భూముల సర్వేకు సంబంధించి మీసేవలో చలాన్ చెల్లించి దరఖాస్తు చేసుకుంటే తదనంతరం సంబంధిత దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకుంటాయి. దరఖాస్తులను పరిశీలించి వరుస క్రమంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి భూములను కొలిచి హద్దులను నిర్ధారించాల్సి ఉంటుంది. కానీ, కొందరు సర్వేయర్లు ఎవరైతే డబ్బులిస్తారో వారి భూములనే మొదట సర్వే చేయడం, వరుసక్రమంలో ముందున్నా పేద రైతుల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచుతున్నారనే ఆరోపణలున్నాయి. కాగా, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 2500 దరఖాస్తుల్లో అత్యధికంగా పేద రైతులవే ఉన్నట్లు సమాచారం.

### సగం మండలాలకే ఉన్న సర్వేయర్లు..

జిల్లాలో భూముల సర్వేకు సంబంధించి సిబ్బంది కొరత వేధిస్తున్నది. జిల్లాలోని సగం మండలాలకు మాత్రమే సర్వేయర్లు ఉన్నారు. జిల్లాలో 20 మండలాలుండగా 10 మండలాలకు మాత్రమే సర్వేయర్లున్నారు. మిగతా మండలాలకు వారికే అదనపు బాధ్యతలను అప్పగించారు. కొందరు సర్వేయర్లు రియల్టర్ల భూముల సర్వే విషయంలో ఒకట్రెండు రోజుల్లో పూర్తి చేసి రిపోర్టు అందజేస్తుండగా.. రైతులను మాత్రం నెలల తరబడిగా తప్పించుకుంటున్నారని పలువురు బాధిత రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.